క్లుప్తంగా

క్రీస్తు బోధనలు సార్వజనీయం

నల్లజర్ల: క్రీస్తు బోధనలు సార్వజనీమని, దేవునిపై భక్తి, విశ్వాసం, విధేయతలతో ప్రతి ఒక్కరూ జీవించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తెలికిచెర్లలోని జీవం గల దేవుని సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫాస్టర్ రాజు ఏసుక్రీస్తు జీవితంలోని ఘట్టాలను వివరిస్తూ విశ్వాసులకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠురోగులకు దుప్పట్ల పంపిణీ



సాగిపాడులో లెప్రసీ రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న 'మానవత' సభ్యులు

గోపాలపురం: క్రిస్మస్ సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సాగిపాడు లెప్రసీ కాలనీ రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మానవత సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సాగిపాడు, వేళ్లచింతలగూడెం, పెద్దాపురం గ్రామాల్లోని వికలాంగులు, వృద్ధులను గుర్తించి వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేమాని వీర్రాజు, కుక్కల కీర్తికుమార్, కొయ్య నాగరాజు, మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ముప్పన కృపాప్రసాద్, జొన్నలగడ్డ రాంబాబు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామికి వెండి కిరీటం సమర్పణ



ప్రక్కిలంకలో భక్తాంజనేయస్వామికి వెండి కిరీటం సమర్పిస్తున్న భక్తుడు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని భక్తాంజనేయస్వామి వారి ఆలయ 20వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి సింధూరంతో భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడికి చెందిన ఉడతా వీర్రాజు కుమారులు సత్యేంద్ర, వీరేంద్రలు స్వామి వారికి వెండి కిరీటాన్ని సమర్పించారు. పెండెం పోశిబాబు కుటుంబ సభ్యులు స్వామి వారికి సింహాసనం అందజేశారు. అలాగే వేగేశ్వరపురం, బల్లిపాడు, పెద్దేవం, అన్నదేవరపేట, గజ్జరం, మలకపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి వారి ఉత్సవాలను రెండో రోజైన సోమవారం కూడా నిర్వహించారు.

బీసీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడుకు చెందిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు గుత్తుల మహాలక్ష్మిని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. మహాలక్ష్మి కుమారుడైన పండు నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సోమవారం ఆయన ఇంటికి వెళ్లి ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ ,నాయకులు పంతం చిన్న, సొసైటీ అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు, కోటిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపురం: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మండలంలోని సాగిపాడు ఎస్సీ కాలనీలోని సుమారు 150 మంది పేదలకు సోమవారం అక్కడి వైఎస్సార్ సీపీ నాయకులు పి.ప్రకాశరావు, అమర వేణుబాబులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో కె.సుబ్బారావు, చర్చి పాస్టర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల సమక్షంలో క్రిస్మస్ వేడుకలు



వికలాంగుల సమక్షంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఆనంద్ స్వరూప్

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడేనికి చెందిన సామాజికవేత్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ గొల్లగూడెం దివ్యాంగులు, వృద్ధుల సమక్షంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆనంద్ స్వరూప్ కేక్ కట్ చేసి వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి వారికి స్వీట్లు, పండ్లు, వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాస్కరరావుకు ఆర్థిక సాయం చేశారు. శార్వాణి స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక ఫణికిషోర్ కూడా పాల్గొన్నారు.



నిడదవోలు కృపాధార లూథరన్ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు. చిత్రంలో చైర్మన్ ఆదినారాయణ



ఉండ్రాజవరం సెయింట్ ఆంబ్రోస్ చర్చిలో పాస్టర్ల వాక్యోపదేశం



వేగేశ్వరపురంలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు



చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో చిన్నారులతో కేక్ చేయిస్తున్న పాస్టర్ మరపట్ల జ్యోజి



పెరవలి మండలం కానూరు ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జననం సెట్టింగ్

శుభోదయం...క్రీస్తు జన్మదినం

- కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, క్యాండిల్ సర్వీసు
- వాక్యోపదేశం చేసిన మత పెద్దలు



నిడదవోలు కృపాధార లూథరన్ చర్చిలో విశ్వాసుల క్యాండిల్ సర్వీసు



గౌరీపట్నం, నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మరియ తల్లి స్వరూపం వద్ద క్రిస్మస్ సందడి



దేవరపల్లి మండలం సుబ్బరాయపురంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: లోక రక్షకుడు, కరుణామయుడైన ఏసుక్రీస్తుకు విశ్వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను సోమవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నిడదవోలు పట్టణంలోని కృపాధార లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంధ్యా క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పాస్టర్లు రెవరెండ్ బయ్యే ఆనంద్‌కుమార్, రెవరెండ్ ఈదా బాబూ వరప్రసాద్, బేటి జయకుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలోని మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చిలో చైర్‌పర్సన్ మెంటే దయా రాజగిరి ఆధ్వర్యంలో భక్తి గీతాలు, బైబిల్ పఠనంతో క్రీస్తును ఆరాధించారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు జస్సికా కిరణ్, ఎం.జస్విని, ఎం.స్రవంతిలకు మెంటే రాజగిరి అచీవ్‌మెంట్ అవార్డులు, నగదు బహుమతులు అందించారు. అలాగే పట్టణంలోని ఆర్‌సీఎం, బెత్లేహేం, మరనాత ప్రార్థనా మందిరాలు, సెయింట్ ఆంబ్రోస్ చర్చి, సెయింట్ జాన్స్ మైనర్ సెమినరీ, క్రీస్తు సంఘం తదితర చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులు వాక్యోపదేశం చేశారు.

మండలంలో..

నిడదవోలు రూరల్: జగద్రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను మండలంలోని ప్రార్థన మందిరాల్లో, క్రైస్తవుల ఇళ్లల్లో ఘనంగా నిర్వహించారు. సమిశ్రగూడెం, మునిపల్లి, కలవచర్ల, పురుషోత్తపల్లి, కోరుమామిడి, తాడిమళ్ల, సెట్టిపేట తదితర గ్రామాల్లోని జీడీఎం, బ్రదరన్, బైబిల్ మిషన్, పెంతుకోస్తు, ఆర్సీఎం చర్చిల్లో క్రిస్మస్ ఆరాధనలు చేశారు. దైవజనులు క్రీస్తుమార్గమే శాంతి సందేశమని ప్రసంగించారు. చిన్నారుల క్రిస్మస్ నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు చర్చిల్లో ప్రేమవిందు ఏర్పాటుచేశారు.

ఉండ్రాజవరం: స్థానిక సెయింట్ ఆంబ్రోస్ చర్చి వద్ద క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ అంటూ నినాదాలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని జీడీఎం, క్రీస్తు లూథరన్, బైబిల్ మిషన్, పెంతెకోస్తు, ఆర్‌సీఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు జననం గురించి పలువురు పాస్టర్లు మాట్లాడారు. క్రీస్తు జననాన్ని వివరిస్తూ పాటలు పాడారు. కిస్మస్ క్యాండిల్స్ వెలిగించారు. తాడిపర్రులోని ఐబీఎం షారోను మందిరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

పెరవలి: మండలంలోని కానూరు ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. విశ్వాసులు ఒకరినొకరు హత్తుకుని మనసారా ప్రభువును తలుచుకుని చర్చి ఫాదర్ క్రీస్తురాజు వద్ద దీవెనలు అందుకున్నారు. మండలంలోని పలు గ్రామాల చర్చిలను విద్యుత్తు దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో విశ్వాసులు ఉదయమే చర్చిలకు వచ్చి ప్రభువు కీర్తనలు ఆలపించారు. కానూరు ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ తాత, క్రీస్తు జననం వంటి సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత ఆలయంలో ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మేరీమాత ఆలయాన్ని వివిధ రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. స్థానిక సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి వద్ద రెవరెండ్ ఫాదర్ పి.రాజశేఖర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పెద్దేవం, మలకపల్లి, ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేట చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక సెయింట్ లూథరన్, జీడీఎం, పెంతెకోస్తు చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నెలటూరు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. పాస్టర్ సతీష్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రైస్తవులు ఉదయం వీధుల్లో తిరుగుతూ ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఊనగట్ల కొత్తపేటలో యూత్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కలవలపల్లిలో హోరేబు ప్రార్థనా మందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ సాల్మన్‌రాజు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. బ్రాహ్మణగూడెం, గౌరిపల్లి, చంద్రవరం, మార్కొండపాడు, దారవరం, చిక్కాల గ్రామాల చర్చిల్లో, ప్రధాన వీధుల్లో క్రిస్మస్ వేడుకల జరుపుకున్నారు.

నల్లజర్ల: ఏసుక్రీస్తు జననం సమస్త లోకానికి అభయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని చీపురుగూడెంలో విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జ్యోజి చిన్నారులతో కేక్ చేయించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పేదలకు దుప్పట్లు అందజేశారు.నల్లజర్ల క్రీస్తు దేవాలయంలో ఫాదర్ ఆంటోనీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జోసెఫ్ శాంతప్ప తదితరులు పాల్గొన్నారు. పోతవరంలో పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలోను, అనంతపల్లి ఈసీఎఫ్ చర్చిలో పాస్టరు జొన్నకూటి నోవాకు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

దేవరపల్లి: మండలంలోని క్రీస్తు ఆలయాలు ప్రార్థనలతో మార్మోగాయి. కేక్‌లు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ఫాదర్లు, క్రైస్తవులు వేడుకల్లో పాల్గొన్నారు. దేవరపల్లి, సుబ్బరాయపురం, యర్నగూడెం గ్రామాల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కే క్‌కట్ చేసి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పుణ్యక్షేత్రానికి వచ్చి ప్రార్థనలు చేశారు.

క్రీస్తు సందేశం మానవాళికి ఆచరణీయం

హోం మంత్రి తానేటి వనిత క్రిస్మస్ శుభాకాంక్షలు



కొవ్వూరు సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కరుణ,ప్రేమ, దయ, సహనం, దాతృత్వం, త్యాగం వంటి గొప్ప సందేశాలని ఏసుక్రీస్తు మానవాళికి అందించారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేటలోని సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి భారీ కేక్ కట్ చేశారు. క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్ రాజన్‌బాబు క్రీస్తు ప్రబోధాలను వివరించి ఏసుక్రీస్తు సంకీర్తనలు ఆలపించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మంత్రి వనిత సోదరి, కొవ్వూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవా ధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ వరిగేటి లలితకుమారి, ముంగమూరి నాగమణి, బత్తి నాగరాజు, పతివాడ రామారావు, వరిగేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు సర్వం సిద్ధం



దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల సందడి (ఫైల్)

- నేటి నుంచి గ్రామ సచివాలయాల స్థాయిలో పోటీలు
- క్రీడా పరికరాల కిట్లు సిద్ధం

దేవరపల్లి: గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం గ్రామ సచివాలయాల పరిధిలో పోటీలు ప్రారంభం అవుతున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని 81 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు ప్రారంభించనున్నారు. పోటీలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉదయం 9 గంటలకు దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించనున్నారు. దేవరపల్లి మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో పోటీలు నిర్వహిస్తారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలు జరుగుతాయి. 15 ఏళ్ల వయసు పైబడిన మహిళలు, పురుషులకు సచివాలయ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ విజయం సాధించిన క్రీడాకారులు మండల స్థాయి, అక్కడి విజేతలు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలు, టీ షర్టులు, టోపీలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఆటలకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఆటల్లో పాల్గొనేందుకు 3223 మంది పురుషులు, 1717 మంది మహిళలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద ఖాళీ ప్రదేశాలు ఉన్న చోట్ల కూడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

కొవ్వూరులో...

కొవ్వూరు: పట్టణంలో ఆడుదాం ..ఆంధ్రా కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఉదయం పది గంటలకు మంత్రి వనిత బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తామని తెలిపారు. కావున మునిసిపాలిటీ పరిధిలో ప్రజాప్రతినిధులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నిడదవోలు : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, మున్సిపల్ హైస్కూళ్లలోని క్రీడా మైదానాల్లో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రారంభిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు.

రాజేశ్వరీ రామకృష్ణన్ మృతి ఈ ప్రాంతానికి తీరని లోటు

చాగల్లు: స్థానిక జైపూర్ షుగర్ ఫ్యాక్టరీ చైర్‌పర్సన్ రాజేశ్వరీ రామకృష్ణన్ మృతి చాగల్లు, ఈ పరిసర ప్రాంత రైతులకు, ఫ్యాక్టరీ కార్మికులకు తీరని లోటని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా అన్నారు. చాగల్లు ప్రాంత రైతులతో వాణిజ్య పంటగా చెరుకును సాగు చేయించి వారి అభివృద్ధికి రాజేశ్వరీ రామకృష్ణన్ ఎంతో కృషి చేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించి నేటికీ వారి హృదయాల్లో రాజేశ్వరీ రామకృష్ణన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్ అన్నారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, గేడా శ్యాం సుందరం తదితరులు ఉన్నారు.

నేడు గురు దత్తాత్రేయ జయంతి

కొవ్వూరు: దత్త జయంతి వేడుకలను మంగళవారం స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర సాయి మందిరంలో నిర్వహించనున్నారు. షిర్డీ సాయినాథ ఆధ్యాత్మిక కేంద్రంలో శ్రీదత్తాత్రేయ వ్రతాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి స్వామి వారికి ఏకవార అభిషేకాలు, అర్చన, తొమ్మిది గంటల నుంచి దత్తాత్రేయ వ్రతాలు ప్రారంభం అవుతాయన్నారు. పండితులు తుట్టగుంట భైరవమూర్తి, మహా మహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతాయ న్నారు.

కూచిపూడి నృత్యానికి వరల్డ్ రికార్డ్సులో స్థానం



హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఖండవల్లి కూచిపూడి నృత్య కళాకారిణులు

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామానికి చెందిన శ్రీ నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ సభ్యులు భాగస్వాములు అయిన కూచిపూడి నృత్య రూపకానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ విషయాన్ని శ్రీ నృత్యప్రియ అకాడమీ గురువు నరుకుల సాయిప్రియ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఒకేసారి 7,209 మంది కూచిపూడి కళాకారులు కళారూపాన్ని ప్రదర్శించారు.ఈ ప్రదర్శనలో తమ విద్యార్థినులు కూడా పాల్గొన్నారని సాయిప్రియ తెలిపారు. ఈ ప్రదర్శనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని సాయిప్రియ వివరించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



గోపాలపురం బీజేపీ కార్యాలయం వద్ద వాజ్‌పేయికి నివాళులు

గోపాలపురం: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ 99వ జయంతిని సోమవారం గోపాలపురంలోని బీజేపీ మండల శాఖ కార్యాలయం వద్ద నిర్వహించారు. వాజ్‌పాయ్‌ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభాష్ యోజన కన్వీనర్ కాట్రగడ్డ రవీంద్ర కోరారు. జయంతి సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే బీజేపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల కన్వీనర్ గెల్లా శ్రీనుబాబు, ఆడబాల రామకృష్ణ, బీవీ రాఘవులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం

నిడదవోలు రూరల్: మనుషుల మధ్య వైషమ్యాలకు కారణమైన మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తీవ్రంగా వ్యతిరేకించారని కేఎన్‌పీఎస్ ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అన్నారు. మండలంలోని సింగవరం, సమిశ్రగూడెం గ్రామాల్లో వద్ద కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో రవీంద్రబాబు అధ్యక్షతన మనుస్మృతి ప్రతులను సోమవారం తగలబెట్టారు. కార్యక్రమంలో బట్టు వెంకటరత్నం, అంబటి రాజబాబు, యువరాజ్, శశికుమార్, రమేష్, సతీష్‌చంద్ర, అభిరామ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్తులు

గుర్తింపునకు నేటి నుంచి సర్వే



కుష్ఠు వ్యాధిపై నల్లజర్లలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సభ్యులు (ఫైల్)

నల్లజర్ల: కుష్ఠువ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడికక్కడ కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈఏడాది జూన్ నెలాఖరు నుంచి రెండు నెలల పాటు సర్వే చేయగా 16 మంది బాధితులు బయటపడ్డారు. గతంలో 110 కేసులు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్ పరిధిలో కొవ్వూరు మండలంలోనే అత్యధిక కేసులు ఉన్నట్టు డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ కె.వెంకట్రావు తెలిపారు.వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందును మళ్లీ డిసెంబరు 26 నుంచి జనవరి 12 వరకూ మరో సారి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. వ్యాధి ఎలా వస్తుంది? నివారణ మార్గాలను ఆయన వివరించారు.

వ్యాధి ఇలా..

మైక్రో బ్యాక్టీరియా లెప్రి అనే సూక్ష్మక్రిమి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. చికిత్స పొందని రోగుల నుంచి గాలి తుంపర్ల ద్వారా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తుల ద్వారా నరాలకు చేరుతుంది. ఏడాది నుంచి పదేళ్ల వ్యవధిలో ఈవ్యాధి బయట పడుతుంది. కుష్ఠు వ్యాధి చికిత్సా కాలం ఆరు నుంచి 12 నెలలు. తొలి దశలో రోగి అప్రమత్తం అయితే పూర్తిగా వ్యాధి నయం కావడమే గాకుండా అంగ వైకల్యాన్ని అధిగ మించవచ్చు. ఒకప్పుడు 50 ఏళ్ల వయసు దాటిన వారిలో మాత్రమే కనపడే ఈ వ్యాధి లక్షణాలు ఇపుడు 25 ఏళ్ల లోపు వారిలో కూడా కనపడుతున్నాయి. చేతులపై పుండ్లు, బొబ్బర్లు ఉంటే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి. వేడి, చల్లటి వస్తువులు పట్టుకుంటే చలనం లేకపోయినా అనుమానించాలి. ఇది సోకితే కనురెప్పలకు పక్షవాతం వచ్చే అవకాశం, అంగవైకల్యం బారిన పడే అవకాశం ఉంది.

ఉచితంగా వైద్య సేవలు



చర్మంపై ఎటువంటి మార్పులు కనిపించినా, లక్షణాలు బయటపడినా వెంటనే సమీప పీహెచ్‌సీలో గాని గ్రామంలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని గాని సంప్రదించాలి. భయంతో ఇంట్లో ఉండిపోతే ప్రమాద తీవ్రత పెరుగుతుంది. రోగుల కోసం ఖరీదైన మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా మందులు ఉచితంగా అందిస్తారు. వ్యాధి తగ్గేవరకు పర్యవేక్షణ ఉంటుంది. బాధితులను గుర్తించేందుకు మంగళవారం నుంచి జనవరి 12 వరకూ సర్వే జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పరిశీలిస్తారు.

–కె.వెంకట్రావు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్, కొవ్వూరు డివిజన్